

శంకుస్థాపన ప్రదేశంలో వివిధ స్థలాల మట్టి వద్ద నమస్కరిస్తున్న చంద్రబాబు

ప్రపంచ రాజధాని అమరావతి.. అడవిలా మారిన వైనాన్ని.. ఆంధ్రుల కలల రాజధాని.. శ్మశాన వైరాగ్యంలో చిక్కుకున్న తీరును. నవ్యాంధ్ర అభివృద్ధికి సంకేతంగా ఉండాల్సిన అమరావతి.. విధ్వంసమైన వైనాన్ని చూసిన చంద్రబాబు ఆవేదన చెందారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని వెంటాడిన విధ్వంసక పీడనను, కమ్ముకున్న నిశ్శబ్దాన్ని, అలుముకున్న చీకట్లను అధిగమించి అమరావతిని అభివృద్ధి పథాన నడిపిస్తానని అభయం ఇచ్చారు. అమరావతి భవిష్యత్‌నకు సంకేతంగా నిలిచిన నిలువెత్తు కట్టడాలను.. అత్యద్భుత నిర్మాణాల పునాదులను.. ఐదేళ్ల పాలనలో జగన్ గాలికి వదిలేయడాన్ని ప్రత్యక్షంగా చూసిన చంద్రబాబు చలించిపోయారు. ఐదేళ్లుగా రహదారులు, భవనాలు నిర్లక్ష్యానికి బలైపోవడం చూసిన నవ్యాంధ్ర రాజధాని సృష్టికర్త చంద్రబాబు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో అమరావతిని అభివృద్ధి పథాన నడిపించాలన్న దీక్ష తన పర్యటనలో కనబరిచారు. అదే హామీని రాజధానివాసులకు కూడా ఇచ్చి ధైర్యం చెప్పారు.

ఆవేదన.. అభయం



జగన్ కూల్చివేసిన ప్రజావేదికను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, మంత్రి నారాయణ



నీటిలో నానుతున్న సచివాలయ టవర్స్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

- అమరావతిలో సీఎం చంద్రబాబు పర్యటన
- వైసీపీ నిర్లక్ష్యానికి బలైన నిర్మాణాల పరిశీలన
- శంకుస్థాపన ప్రదేశంలో సాష్టాంగ నమస్కారం
- ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచి పర్యటన ప్రారంభం
- రాజధాని రైతుల త్యాగాలను శ్లాఘించిన ముఖ్యమంత్రి
- అమరావతి స్థల మహత్యమే విధ్వంసాన్ని తట్టుకోగలిగింది
- 1631 రోజులు యజ్ఞం చేసి అమరావతిని మహిళలు కాపాడారు
- సంపద కేంద్రాన్ని ధ్వంసం చేయాలని చూసినా పోరాడి నిలిచింది
- ఐదేళ్ల విధ్వంసంపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తానన్న ముఖ్యమంత్రి



తుళ్లూరు/ గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండు కళ్లలాంటి పోలవరం, అమరావతిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇటీవల పోలవరంలో పర్యటించిన ఆయన గురువారం అమరావతిలో పాదం మోపారు. అమరావతిలో వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సృష్టించిన విధ్వంసాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా చూసి చలించిపోయారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంసకర పాలనకు నిదర్శనంగా నిలిచిన అమరావతిని చూసిన ఆయన ఆవేదన చెందారు. వైసీపీ ప్రభుత్వం తొలుత పడగొట్టిన ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచి ముఖ్యమంత్రి అమరావతి పర్యటన ప్రారంభమైంది. ప్రజావేదిక వద్ద శిథిలాలను పరిశీలించారు. విధ్వంసంతో మొదలైన వైసీపీ పాలన విధ్వంసకరంగానే సాగిందని ఆవేదన చెందారు. అక్కడి నుంచి ఉద్దండరాయునిపాలెంలోని రాజధాని శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్దసంఖ్యలో రాజధాని ప్రాంతవాసులు అక్కడకు చేరుకుని చంద్రబాబు కోసం వేచి చూశారు. పవిత్రమైన మట్టి, పుణ్యజాలలతో చేసిన స్థూపాన్ని సందర్శించి సాష్టాంగ నమస్కారం చేశారు. మోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాలతో పాటు అక్కడున్న యజ్ఞశాలలను, మాష్టర్‌ప్లాన్ నమూనా మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. దాన్ని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన తీరును చూసి చంద్రబాబు ఆవేదన చెందారు. అనంతరం హైకోర్టు క్రాస్ రోడ్డులోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల్ని పరిశీలించారు. మూడంతస్తుల వరకూ మెట్లు ఎక్కి భవనాల్లోని గదులను పరిశీలించారు. ఆ తర్వాత ఆలిండియా సర్వీసెస్ జూనియర్ ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించారు. అక్కడ నుంచి సెక్రటేరియట్ భవనాల కోసం వేసిన పునాదులను పరిశీలించి అవి నీటిలో నానిపోయి ఉండటాన్ని చూసి చలించిపోయారు. వాటి పరిస్థితిపై అధికారులతో ఆరా తీశారు. అనంతరం క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించారు. సగంలో ఆగిపోయిన వాటి దుస్థితిని గమనించారు. అక్కడి నుంచి హైకోర్టు మీదగా జడ్జిల భవన సముదాయాలను పరిశీలించేందుకు బయలుదేరగా, హైకోర్టు న్యాయవాదులు ఆయన కాన్వాయ్ వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి అభివాదం చేశారు. ఆ తర్వాత న్యాయమూర్తులు, మంత్రుల గృహ సముదాయాలను చూసుకుంటూ సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట పురపాలక శాఖామంత్రి నారాయణ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కొలికిపూడి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పురపాలక శాఖ కమిషనర్ సింగాల్, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కరరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, అమరావతి మహిళా జేఏసీ నేత శిరీష, పులి చిన్నా, టీడీపీ నేతలు, అమరావతి రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రూప్ డి హౌసింగ్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న చంద్రబాబు



హైకోర్టు వద్ద చంద్రబాబుకు అభివాదం చేస్తున్న ప్రజానీకం



అమరావతి ఆర్ట్ గ్యాలరీలోని నమూనాలు పరిశీలిస్తున్న చంద్రబాబు

వారిది విధ్వంసం.. మాది బాధ్యత

ప్రజల సంపద.. సంపద సృష్టి కేంద్రం.. స్వయంపోషక నగరమైన అమరావతిపై ఐదేళ్లలో వైసీపీ నేతలు విషం గక్కారు. బ్రాండ్ ఇమేజ్‌ను చంపేయాలనుకున్నారు.. అని చంద్రబాబు తెలిపారు. ఐదేళ్ల నిర్లక్ష్యానికి బలైన అమరావతిని చూసి చలించిపోయిన చంద్రబాబు సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతులు, మీడియాతో మాట్లాడారు. అమరావతి దుస్థితిని చూసినప్పుడు చెప్పలేని బాధ, ఆవేదన కలిగాయని చెప్పారు. శంకుస్థాపన ప్రాంతంలో పవిత్రమైన మట్టిని భద్రపరిస్తే ఆ మట్టిని రాజధాని రైతులు ఐదేళ్లపాటూ కాపాడారన్నారు. మాష్టర్‌ప్లాన్ నమూనాను అల్లరిమూకలు దెబ్బ తీసేందుకు కూడా యత్నించారన్నారు. 1631 రోజులపాటు రాజధాని రైతులు, మహిళలు యజ్ఞం చేసి అమరావతిని కాపాడుకున్నారన్నారు. వారి త్యాగం మరువలేనిదంటూ వారిని అభినందించారు. రాజధానిలో నిలిచిపోయిన భవనాలు చూస్తే ఆవేదన కలిగిందన్నారు. ఐదేళ్ల క్రితం వేసిన మట్టి అలానే ఉందన్నారు. పైపులు, ఇసుక దొంగలించుకుపోయారన్నారు. రోడ్డు కోసం వేసిన మట్టిని కూడా తవ్వుకుపోయారని తెలిపారు. ఒక్క భవనాన్ని కూడా గత ప్రభుత్వం ముట్టుకోలేదని, దేన్నీ పట్టించుకోలేదని వాటిని చూస్తే ఏమి చేయాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐదేళ్లలో రోడ్లు, భవన నిర్మాణాలన్నీ పూర్తి చేసుకునేవని చెప్పారు. 80 శాతం పనులు పూర్తి అయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల క్వార్టర్లు ఎక్కడవిక్కడే ఆగిపోయాయన్నారు. కార్యదర్శులు, ప్రిన్సిపల్ కార్యదర్శుల భవనాలు తుమ్మ చెట్లతో నిండిపోయాయని తెలిపారు. గ్రూప్-4 ఉద్యోగుల భవనాలు సగంలో ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుజాతి గర్వంగా, సగౌరవంగా చెప్పుకునే రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. రాజధాని నిర్మాణం విషయంలో అధైర్యం వద్దని, బాధ్యతగా నిర్మాణం చేపడతామని భరోసా ఇచ్చారు. వైసీపీ పాలన ఎంత విధ్వంసకరంగా జరిగిందో పోలవరం, అమరావతిని పరిశీలిస్తే తెలుస్తుందన్నారు.

స్థల మహత్యమే.. కాపాడింది

ప్రముఖ ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేసి పవిత్రమైన మట్టిని, నదుల నుంచి పుణ్యజలాలను తెచ్చి అమరావతికి శంకుస్థాపన చేశాం. స్వతంత్ర్య సమర యోధులు, త్యాగమూర్తుల జన్మస్థలాల నుంచి మట్టిని, జలాలను తెచ్చాం. ఆ మహిమే ఈ రోజు అమరావతిని కాపాడింది. అమరావతి పవిత్రమైన ప్రాంతంగా మారింది. తాత్కాలికంగా కొంతమంది ఈ ప్రాంతాన్ని అతలాకుతలం చేయాలనుకున్నా, ఆ స్థల మహత్యం వల్ల మళ్లీ తిరిగి నిలబెట్టుకోగలిగాం.

ఆలోచించండి..

వైసీపీకి ఓటు వేసి వారు ఐదేళ్లలో రాష్ట్రం ఏవిధంగా నష్టపోయిందో తెలుసుకోవాలి. ఐదేళ్లలో ఎలా ఉండాల్సిన రాజధాని ఎలా ఉందో ఒక్కసారి అర్థం చేసుకోవాలి. అమరావతిలో జరిగిన విధ్వంసాన్ని చూసి జగన్‌రెడ్డి పాలన గురించి ఆలోచించాలి. ఇటువంటి వారు రాజకీయాల్లో ఉంటే రాష్ట్రానికి తిప్పలు తప్పవు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి, ముఖ్యమంత్రిగా అర్హత లేని వ్యక్తి ఆ పదవి వస్తే ఏమిచేస్తాడో ఈ ఐదేళ్లు చూశాం. రాష్ట్ర ప్రజలు ఒక్క సారి తాము ఎవరిని కోరుకున్నామో ఆలోచించాలి. అమరావతి, పోలవరం వ్యక్తిగత సంపద కేంద్రాలు కావు. ఏ ఒక్క వ్యక్తికో, వర్గానికో ప్రాంతినికో పరిమితమైనవి కావు. ఇవి సంపద కేంద్రాలు. సంపద సృష్టిస్తే సమాజానికి పనికివస్తుంది. వ్యక్తులు బాగుపడతారు. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించవచ్చు. కానీ ఐదేళ్లు జగన్ దీనిని విస్మరించి.. అటు పోలవరం, ఇటు అమరావతిని పాడుబెట్టి ప్రజలను నష్టపరిచాడు.







నిర్మాణానికి నోచుకోకపోవడంతో నిలిచిపోయిన రాజధానిలోని భవనాలు

రెవెన్యూ మంత్రిగా అనగాని

- బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్
- శాఖను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్న మంత్రి
- భూముల రీసర్వేలో రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

రేపల్లె, జూన్ 20: ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న ఆయనకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన గురువారం వెలగపూడి సచివాలయం నాలుగో బ్లాకులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ మంత్రిగా వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అనంతరం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు మంత్రితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్ జనార్ధన్, నాదెండ్ల మనోహర్, బాలవీరాంజనేయ స్వామి, సవిత, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, గల్లా మాధవి, ఎంఎం కొండయ్య, చింతమనేని ప్రభాకరరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ తదితరులు అనగానికి అభినందనలు తెలిపారు.

జవాబుదారీతనాన్ని పెంపొందిస్తా

రెవెన్యూ శాఖలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కోర్టు కేసుల సమర్థ నిర్వహణకు ఆన్‌లైన్‌లో రెవెన్యూ కోర్టు విధానం ప్రవేశపెడతామన్నారు. రెవెన్యూ సిబ్బందికి శిక్షణ కోసం ప్రత్యేకంగా రెవెన్యూ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఏపీ రెవెన్యూ శాఖను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో జారీకి తగిన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో కొంతమంది మంత్రులు ఇష్టానుసారంగా భూములను ఆక్రమించారన్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో జగన్ అండ్ కో ప్రభుత్వ భూములను తక్కువ ధరలకే కట్టబెట్టి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని, వాటిపై విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తామని మంత్రి తెలిపారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్‌తో రెవెన్యూ అధికారులు

పట్టాలెక్కిన అమరావతి రైలు



- స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం
- రైల్వే మంత్రిత్వ శాఖ గజిట్ నోటిఫికేషన్ జారీ
- ఇక భూసేకరణ సులభతరమని తేల్చిన రైల్వేవర్గాలు
- ఇదో శుభ పరిణామం అంటున్న అమరావతి రైతులు

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ-1 ప్రభుత్వంలో ఏపీకి మంజూరైన అమరావతి నూతన రైలుమార్గం తిరిగి ఎన్‌డీఏ-3లో పట్టాలపైకి వచ్చింది. అమరావతి నూతన రైలుమార్గాన్ని స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. ఈ మేరకు భూసేకరణ నిమిత్తం తాజాగా ఆ శాఖ గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అమరావతి రైలు మార్గం కోసం ఏపీలోని గుంటూరు, ఎన్‌టీఆర్, పల్నాడు, తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో భూములను సేకరించాల్సి ఉన్నది. కేంద్రం తాజా నిర్ణయం వల్ల భూసేకరణ సులభతరం అవుతుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. ప్రజావసరాల కోసం జాతీయ మౌలిక సదుపాయాలు కల్పించే క్రమంలో అమరావతి రాజధాని నూతన రైలుమార్గాన్ని స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా కేంద్రం పరిగణిస్తున్నట్లు పేర్కొన్నది. మరికొద్ది రోజుల్లో కేంద్రంలో ఏర్పడిన ఎన్‌డీఏ-3 ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ని ప్రవేశపెట్టబోతుండటంతో అమరావతి రైలుమార్గం ప్రాజెక్టు భూసేకరణకు కూడా నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. మొదట్లో ఇది కాస్ట్ షేరింగ్ ప్రాజెక్టు. నిధుల కొరతతో రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేంద్రమే ఈ ప్రాజెక్టుని చేపట్టాలని విజ్ఞప్తి చేయగా సొంత నిధులతోనే పూర్తి చేయాలని రైల్వే శాఖ భావించింది. ఇప్పుడు టీడీపీ ఆధారిత ఎన్‌డీఏ-3 ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టిన దృష్ట్యా కేంద్రమే భూసేకరణ చేసే అవకాశం ఉన్నది. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు వారాల వ్యవధిలోనే అమరావతి రాజధానికి మేలు చేసే నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నుంచి వెలువడటం శుభపరిణామమని రైతులు పేర్కొంటున్నారు.

రైలు మార్గం రెండు దశల్లో..

తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎర్రుబాలెం నుంచి అమరావతి మీదగా నంబూరు వరకు(56.53 కిలోమీటర్లు) తొలి దశలో సింగిల్ లేన్ అమరావతి రైలుమార్గానికి డీపీఆర్ రూపుదిద్దుకొన్నది. ఇది ఒక విధంగా విజయవాడకు బైపాసు రైలుమార్గంగా ఉపయోగపడుతుంది. అలానే నరసరావుపేట నుంచి సత్తెనపల్లి, పెదకూరపాడు నుంచి అమరావతికి కూడా రెండు సింగిల్ లేన్‌మార్గాలను ఇందులో చేర్చారు. వీటిని రెండో దశలో నిర్మిస్తారు. ఇందుకోసం మొత్తంగా రూ.2,800 కోట్లకు పైగా నిధులు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో కృష్ణానదిపై 3 కిలోమీటర్ల రైలువంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుని రైల్వే శాఖ అటకెక్కించింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయిని కూడా కేంద్రం నుంచి అడగలేదు. ఇక అమరావతి రైలుమార్గం మరిచిపోవాల్సిందేనని భావిస్తున్న తరుణంలో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం.. కేంద్రంలో చంద్రబాబు కీలకపాత్ర నేపథ్యంలో అమరావతి రైలు ప్రాజెక్టు ముందుకు తీసుకెళతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది.

గంజాయి విక్రేతల అరెస్టు

● రెండు కిలోలు గంజాయి స్వాధీనం

తెనాలి అర్బన్, జూన్ 20 : గంజాయి అమ్ముతున్న వారితో పాటు వినియోగిస్తున్న వారిని కూడా టు టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం టు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రమేష్ వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రెండు కిలోల గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా చోటప్పల్ గ్రామానికి చెందిన అల్లాడి మణికంఠ ఈశ్వర్, కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన దాసరి శ్రీసాయిశంకర్ భవానీ, గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన రామిశెట్టి శ్యాంవెంకట్, విజయవాడకు చెందిన ఉయ్యూరు కౌషిక్‌రెడ్డి, తెనాలి నందులపేటకు చెందిన కోటిసాయిమంజునాధ, పెదకాకాని మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి మణికంఠ, నందులపేటకు చెందిన దేవిశెట్టి బసవేశ్వరరావులను అరెస్టు చేశామన్నారు. వీరిలో ముగ్గురు నిందితులు ఒరిస్సాలోని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అమ్ముతున్నారు. వీఎస్ఆర్ కళాశాల వద్ద గంజాయి అమ్మే క్రమంలో అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు. టు టౌన్ సీఐ సుధాకర్, సిబ్బంది అనిల్, అంకయ్య, సాంబశివరావు, వెంకటప్రసాద్, గణేష్, దేవదాసులను అభినందించి రివార్డు ప్రకటించారు.

మూల్యాంకనం.. తూతూమంత్రం

● రోజుకు 90 బీఈడీ పేపర్లు దిద్దేస్తున్నారు...
● ఎంఈడీ విద్యార్థులతో బీఈడీ మూల్యాంకనం
● అతిథి అధ్యాపకులే... పర్యవేక్షణాధికారులు
● అధ్యాపకులపై వైసీపీ సలహాదారుడి బంట్రోతు జులుం

గుంటూరు(విద్య), జూన్ 20: అక్రమాలను ప్రోత్సహించడం.. నిబంధనలకు నీళ్ళొదలడంలో దిట్ట అయిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిపాలన గణం బీఈడీ వాల్యూయేషన్‌లోనూ తమ అక్రమాల పరంపరను కొనసాగిస్తోంది. టిక్ కొట్టు.. పైసలు పట్టు అన్నచందంగా వర్శిటీలో బీఈడీ మూల్యాంకనాన్ని నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీస అవగాహన, అనుభవం లేని అధ్యాపకుల్ని మూల్యాంకన అధికారులగా నియమించి కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా మార్చారు. బీఈడీ 2022- 24 సంవత్సరానికి సంబంధించి నాలుగో సెమిస్టర్ మూల్యాంకనం జూన్ ఆరు నుంచి వర్శిటీలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 3, 4 పేపర్ల మూల్యాంకనం సాగుతోంది. వాస్తవంగా ఒక్కో అధ్యాపకుడు రోజుకు కనీసం 35 నుంచి 45 పేపర్లు మాత్రమే వాల్యూయేషన్ చేయాలి. అయితే తాజాగా వర్శిటీలో ఒక్కో ఎగ్జామినర్ చేత 90 పేపర్లు, ఛీఫ్ ఎగ్జామినర్ల చేత 60 పేపర్లు దిద్దిస్తున్నారు. మూడు నిమిషాలకు ఒక పేపర్‌ను మూల్యాంకనం చేయడం, స్క్రూటినీ చేయడం సాధ్యం కాకున్నా అధికారులు బలవంతంగా చేయాలని వేధిస్తున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 45 పేపర్లకు ఒక డీఏ ఇచ్చారని ప్రస్తుతం 90 పేపర్లకు మూల్యాంకనం చేసినా ఒక డీఏ ఇవ్వకుండా అధ్యపకుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. సమస్యపై పీజీ కోఆర్డినేటర్‌ను కలిస్తే దుర్భాషలాడినట్లు అధ్యాపకులు వాపోతున్నారు. ఈ విషయం గురువారం సాయంత్రం వీసీని కలవడానికి వారు ప్రయత్నాలు చేశారు. ఎంఈడీ అప్రూవల్ అయిన అధ్యాపకుడ్ని ఛీఫ్‌గా నియమించి బీఈడీ పేపర్లను ఒక అధికారి అండతో అక్రమంగా మూల్యాంకనం చేయిస్తున్నారని, కనీసం రెండు సంవత్సరాలు అనుభవం కూడా లేని అతిథి అధ్యాపకుల్ని అధికారులుగా ఎలా నియిమిస్తారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. ఒక అతిథి అధ్యాపకుడు అధికారి హోదాలో మహిళా అధ్యాపకుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలోని కీలక సలహదారుడి కార్యాలయం బంట్రోతుగా ఉంటూ దొడ్డిదారి ఉద్యోగం పొంది ఓ వ్యక్తి పట్టభద్రులపై జులం ప్రదర్శిస్తున్నాడని బీఈడీ అధ్యాపకులు వాపోతున్నారు.

వారిద్దరిదీ.. బాల్య స్నేహం



ద్వారకా తిరుమలరావు, శ్రీనివాస్

ఇద్దరు డీజీపీలు ఒకే స్కూల్... ఒకే కేడర్ ● ఒకరేమో పాండిచ్చేరి డీజీపీగా శ్రీనివాసన్ ● మరొకరు ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు ● ప్రాథమిక విద్య కృష్ణనగర్ ప్రభుత్వ పాఠశాలలో.. ● సీతారామయ్య హైస్కూల్లో పదో తరగతి వరకు విద్యాభ్యాసం

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ చిన్ననాటి నుంచి మిత్రులు.. ఇద్దరూ ప్రాథమిక విద్యను గుంటూరు కృష్ణనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో, హైస్కూల్ విద్యను బృందావన్‌గార్డెన్స్‌లోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. విశేషమేమి టంటే ఉన్నత విద్య కూడా ఇద్దరూ కలిసి హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఒకరైన సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఇక్కడే పుట్టి పెరిగి ఏపీ కేడర్‌లో ఐపీఎస్(1989) కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ఆ శాఖలో ఉన్నత పదవి అయిన డీజీపీ పోస్టులో తాజాగా నియమితులయ్యారు. ఆయన మిత్రుడు బి.శ్రీనివాసన్ ఏడాది క్రితం పాండిచ్చేరి డీజీపీగా నియమితులై ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఈ ఇద్దరు మిత్రులు ఏకకాలంలో వేర్వేరు రాష్ట్రాలకు డీజీపీలుగా పనిచేసే అవకాశం లభించింది. శ్రీనివాసన్ 1990లో ఐపీఎస్‌కు జనరల్ కేటగిరీలో జమ్మూకాశ్మీర్ కేడర్‌లో ఎంపికయ్యారు. శ్రీనివాస్ జన్మస్థలం కావలి అయినప్పటికీ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఆయన తండ్రి సదానందరావు ఉద్యోగరీత్యా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రాథమిక విద్య కోసం గుంటూరులోని కృష్ణనగర్ ప్రభుత్వ పాఠశాలలో వీరిద్దరిని తల్లిదండ్రులు చేర్పించారు. అలా వీరిద్దరి మధ్య బాల్య స్నేహం మొదలైంది. ఆ తర్వాత 1974 నుంచి 79 వరకు గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. విశేషమేమిటంటే వీరిద్దరు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించారు. ఇద్దరూ కూడా ఐపీఎస్ టార్గెట్‌గా పెట్టుకొని పట్టుదలతో చదివారు. ఇద్దరూ చదువులోనే కాకుండా ఉద్యోగ బాధ్యత నిర్వహణలో కూడా ప్రతిభను చాటుకున్నారు. ప్రభుత్వం నుంచి వివిధ పురస్కారాలు అందుకున్నారు. వీరిద్దరూ డీజీపీ స్థాయికి వెళ్ళినా చిన్ననాటి స్నేహితులను మరిచిపోలేదు. ఎక్కడ పనిచేస్తున్నా గుంటూరు కృష్ణనగర్ పాఠశాలలో తమతో పాటు చదువుకున్న మిత్రులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. అదే పాఠశాలలో చదువుకొని గుంటూరులో ప్రముఖ హోమియో వైద్యుడిగా స్థిరపడిన డాక్టర్ ఓవీ రమణ వీరిద్దరికి అత్యంత సన్నిహితుడు. కాగా ఈ ఇద్దరు డీజీపీలను చిన్నతనంలో తమ విద్యాభ్యాసం ప్రారంభించిన కృష్ణనగర్ పాఠశాలకు త్వరలో పిలిపించి ఆత్మీయ సమావేశం నిర్వహించి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని ఆ నాటిమిత్రులు యోచన చేస్తున్నారు.

వైసీపీ బాధిత డీఎస్పీకి విముక్తి

● డీఎస్పీ గోగినేని రామాంజనేయులుపై సస్పెన్షన్ ఎత్తివేత
● నిబంధనలకు విరుద్ధంగా నాలుగున్నరేళ్లుగా సస్పెన్షన్
● లోకేశ్‌కు సన్నిహితుడిగా ముద్రవేసి వేధింపులు
● వైసీపీ అధికారంలోకి రాగానే వీఆర్‌లోకి
● 2020 జనవరి నుంచి నేటి వరకు సస్పెన్షన్ లోనే..



గుంటూరు, మంగళగిరి, జూన్ 20: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అటు టీడీపీలో ముఖ్యంగా పోలీస్‌శాఖలోనూ ఒక వర్గమే లక్ష్యంగా సాగించిన వేధింపులకు ఎందరో బలయ్యారు. వారిలో నార్త్ డీఎస్పీగా విధులు నిర్వహించిన గోగినేని రామాంజనేయు లు ఒకరు. ఆయన విధులు నిర్వహించిన నార్త్ సబ్ డివిజన్ అప్పటి మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఉండడమే ప్రధాన కారణం. ఆయన నార్త్ డీఎస్పీగా పని చేసిన సమయంలోనూ, 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ లోకేశ్‌కు అనుకూలంగా వ్యవహరించినట్లు వైసీపీ భావించి వేధింపులు ప్రారంభించింది. నిరాధార ఆరోపణలతో ఆయనను సస్పెండ్‌తో పాటు కేసు నమోదు చేయడం, అదేవిధంగా ఏసీబీ కేసుకు విఫలయత్నం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నాలుగున్నరేళ్ళ పాటు సస్పెన్షన్‌లో ఉంచింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామాంజనేయులు కు విముక్తి లభించింది. అకారణంగా విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు బుధవారం డీజీపీ జారీచేసిన ఉత్తర్వులు గురువారం వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే..

మంగళగిరి ప్రాంతానికి చెందిన గాయత్రి మిస్సింగ్ కేసులో అప్పటి నార్త్ డీఎస్పీ గోగినేని రామాంజనేయులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ వైసీపీ నేతలు ఆకాశరామన్న ఉత్తరం రాశారు. దానిపై డీఎస్పీ రామాంజనేయులుపై రిపోర్టు రాసి సస్పెన్షన్ వేటు వేశారు. వాస్తవానికి గాయత్రి అనే యువతి మహమ్మద్ భాష అనే యువకుడిని ప్రేమించి మతాంతర వివాహం చేసుకొని మహమ్మద్ ఆషాగా పేరు మార్చుకుంది. ఆ తరువాత భార్య, భర్తల మధ్య వచ్చిన వివాదంలో మధ్యవర్తిగా వచ్చిన చిమట రామకోటేశ్వరరావు కొంతకాలానికి గాయత్రితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ తరువాత ఆమెను విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకు వారి మధ్య కూడా మనస్పర్థలు రావడంతో గాయత్రిని రామకోటేశ్వరావు హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ సమయంలో గాయత్రి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయలేదనేది అభియోగం. గాయత్రిని హత్య చేసి మృతదేహాన్ని రేపల్లె సమీపంలోని పెనుమూడి బ్రిడ్జి వద్ద కృష్ణా నదిలోకి విసిరేసినట్లు అభియోగం. అయితే ఆ సమయంలో తనతో పాటు ఉన్న మరో వ్యక్తి సుబ్బారావు ద్వారా ఈ విషయం ఎప్పటికైనా బయటికి వస్తుందనే ఉద్దేశంతో ఆ తర్వాత సుబ్బారావును కూడా రామకోటేశ్వరావు హత్య చేసినట్లు మంగళగిరి పోలీసులకు ఆకాశరామన్న ఉత్తరం అందింది. అయితే ఇందులో గాయత్రి అదృశ్యమైనప్పుడు మిస్సింగ్ ఫిర్యాదు చేస్తే మంగళగిరి ఎస్ఐ, సీఐలు బాధ్యత వహించాలి. అయితే దానితో సంబంధం లేని డీఎస్పీ రామాంజనేయులుపై అభియోగం మోపారు. డీఎస్పీ ఒత్తిడి వల్లే వారు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. తొలుత వైసీపీ అధికారంలోకి రాగానే 2019 జూన్‌లో రామాంజనేయులును వీఆర్‌కు పంపారు. 2020 జనవరి 6న సస్పెన్షన్ వేటు విధించారు. అప్పటి నుంచి ఆయనపై వేధింపుల పర్వం కొనసాగుతూ వచ్చింది.

సివిల్ వివాదంలో బాధితురాలికి న్యాయం చేయలేదని..

మంగళగిరి ప్రాంతంలో విజయవాడకు చెందిన వారు వేసిన రియల్ వెస్టేట్ వెంచర్లో పొన్నాడ నాగమణి అనే మహిళ ప్లాటు కొనుగోలు చేశారు. అయితే అంతకుముందే ఆ ప్లాట్‌ను వేరొకరు కొనుగోలు చేసినట్లు ఆ తర్వాత తెలిసింది. దీంతో బాధితురాలు తన డబ్బు తనకు ఇవ్వమని అడగ్గా వారు కాలయాపన చేస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఎస్పీ ఆదేశాలతో ఈ విషయంలో అప్పటి నార్త్ డీఎస్పీ రామాంజనేయులు తొలుత రియల్ ఎస్టేట్ వ్యాపారులను పిలిపించి మూడు రూపాయలు వడ్డీతో ఆమె డబ్బు ఆమెకు ఇవ్వాలని హెచ్చరించి పంపారు. అయితే సకాలంలో వారు డబ్బులు ఇవ్వకపోవడంతో రామాంజనేయులు వారిని మరోసారి పిలిపించి వారి ద్వారా ఆమెకు చెక్కులు, నోట్లు ఇప్పించి ఆమె వద్ద ఉన్న ఒరిజినల్ దస్తావేజులను వారికి ఇప్పించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన డబ్బులు కోసం ఎన్నిసార్లు డీఎస్పీ కార్యాలయం చుట్టూ తిరిగినా తనకు డబ్బులు ఇప్పించకపోగా రియల్ వేస్టేట్ వెంచర్ వారికి డీఎస్పీ అనుకూలంగా వ్యవహరించారంటూ నాగమణి అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి సీఐడీ అడిషనల్ డీజీ పీవీ సునీల్ కుమార్ కేసు నమోదు చేసారు. అయితే అప్పటికే ఈ సివిల్ వివాదంపై బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కావడంతో దీనిపై రామాంజనేయులు హైకోర్టులో పిటిషన్ వేయగా విచారించిన కోర్టు సిఐడి కేసును క్వాష్ చేస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో అప్పటి ఏసీబీ అడిషనల్ డీజీ పీ సీతా రామాంజనేయులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీలో కేసు నమోదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే డీఎస్పీ రామాంజనేయులు తన ఆస్తులు, ఆదాయపను శాఖకు చెల్లింపులు వంటి ఆధారాల న్నింటినీ ఏసీబీ అధికారుల ముందు ఉంచారు. అయితే అడిషనల్ డీజీ పిఎస్ఆర్ అంజనేయులు నుంచి ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ కింది స్థాయి అధికారులు ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసే ధైర్యం చేయలేకపోయారు.

సస్పెన్షన్‌లో ఉంచడం చట్ట విరుద్ధం

ఏసీబీ కేసులు సహా శాఖాపరంగా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ శాఖలో ఏ ఉద్యోగిని అయినా ఆరు నెలలకు మించి సస్పెన్షన్‌లో ఉంచకూడదు. ఆరునెలల్లో ఆయనపై వచ్చిన అభియోగాలను విచారించి కేసుపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. అందుకు విరుద్ధంగా విచారణ అధికారులు ఎవరైనా ఆ తర్వాత కూడా సస్పెన్షన్ కొనసాగిస్తూ వస్తే వారిపై సంబంధిత ఉద్యోగి తగు చర్యలు తీసుకునే వెసులుబాటు కూడా ఉంది. అయితే డీఎస్పీ రామాంజనేయులు కేసు విచారణ అధికారిగా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను నియమించారు. మొదటి రెండేళ్ల విజయవాడ కమిషనర్‌గా చేసిన శ్రీనివాసులు, ఆ తర్వాత కమిషనర్‌గా చేసిన కాంతి రాణాటాటా కేసు విచారణ జరపకుండా ఆరు నెలలకు ఒకసారి సస్పెన్షన్‌ను పొడిగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలిస్తూ వచ్చారు. హైకోర్టు ఉత్తర్వులు పురస్కరించుకుని టీడీపీ ప్రభుత్వం డీఎస్పీ రామాంజనేయులుపై ఉన్న సస్పెన్‌ను ఎత్తివేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ ఉత్తర్వులు అందుకున్న రామాంజనేయులు విధుల్లో చేరుతున్నట్టు గురువారం సాయంత్రం డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

29న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు(లీగల్), జూన్ 20: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించడానికి ప్రతి కోర్టులో ఓ న్యాయమూర్తితో పాటు ఇరువురు న్యాయవాదులతో బెంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇరు పక్షాల వారితో సామరస్య పూర్వకంగా చర్చించి రాజీమార్గంలో కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమైతే ఆయా కేసుల్లో కక్షిదారులు వారు చెల్లించిన కోర్టు ఫీజును వాపసు పొందవచ్చన్నారు. లోక్ అదాలత్ అవార్డు మీద అప్పీల్‌కి వెళ్లే అవకాశం లేదని తెలిపారు. కక్షిదారులందరూ రాజీమార్గంలో లోక్ అదాలత్ ద్వారా తమ కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, ధనాన్ని వృథా కాకుండా కాపాడుకోవచ్చన్నారు. సివిల్, రాజీ పడదగ్గ క్రిమినల్, వివాహ సంబంధిత, రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రభుత్వం చేసిన భూ సమీకరణలకు సంబంధించిన కేసులు, కన్స్యూమర్ కోర్ట్ కేసులు, లేబర్ కోర్టు కేసులు ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00



రైల్‌వికాస్ భవన్‌లో జరిగిన డీఆర్‌యూసీసీ చివరి సమావేశంలో పాల్గొన్న సభ్యులు, డీఆర్ఎం, ఇతర అధికారులు

ఐఆర్‌టీటీసీకి పలు రైళ్లను ప్రతిపాదించాం

డీఆర్‌యూసీసీ సమావేశంలో సభ్యులకు అధికారుల సమాధానం

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే టైంటేబుల్ కోఆర్డినేషన్ సమావేశం(2024)కి పలు రైళ్లను గుంటూరు మీదగా ప్రతిపాదించామని రైల్వే అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో డీఆర్‌యూసీసీ ప్రస్తుత కమిటీ చివరి సమావేశం డీఆర్ఎం ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. వాటిపై అధికారులు స్పందిస్తూ పినాకిని ఎక్స్‌ప్రెస్‌ని న్యూగుంటూరు రైల్వేస్టేసన్ మీదగా మళ్లించాలని ప్రతిపాదించామన్నారు. అలానే సికింద్రాబాద్ - రేపల్లె నెంబరు. 17645 రైలుకి వేమూరులో నిలుపుదల కోసం రాశామన్నారు. వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని డైలీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. కాచీగూడ - నడికుడి ప్యాసింజర్ రైలుని వినుకొండ వరకు న్యూపిడుగురాళ్ల మీదగా నడపాల్సిందిగా ప్రతిపాదన పంపడం జరిగిందన్నారు. అయితే హెడ్‌క్వార్టర్స్ నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు, ఆర్‌వోబీల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. చివరిగా డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌కి ఇప్పటికే కొన్ని గతిశక్తి కార్గో టెర్మినల్స్ వచ్చాయని, దీంతో సరుకు రవాణ గణనీయంగా పెరిగిందన్నారు. అలానే రాబోయే రోజుల్లో మరికొన్ని జీసీటీలు రాబోతోన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఏడీఆర్ఎం కే సైమన్, వివిధ విభాగాల సీనియర్ అధికారులు డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, ఎం దినేష్‌కుమార్, జేవీ అనూష, జి.సూర్యనారాయణ, బి.లక్ష్మణ్, సీఆర్ సర్కార్, కె.సత్యహరప్రసాద్, కమలాకర్‌బాబు, భారత్, ఈ.సుదర్శన్‌రెడ్డి, సభ్యులు ఆర్‌కెజె నరసింహం, కే కిషోర్‌బాబు, సురేష్‌బాబు, పీ వెంకటేశ్వరరావు, జే శ్రీనివాసరావు, కే రమేష్, ఎం పోలేశ్వరరావు, వీరరాఘవయ్య పాల్గొన్నారు.

నీట్ పరీక్షా ఫలితాలపై విచారణ జరిపించాలి

● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్

గుంటూరు(తూర్పు), జూన్20: నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు నాసర్‌జీ, వలి డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట, భగత్ సింగ్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నెట్ పేపర్ లీకేజీ అయిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని.. నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయరో 24 లక్షల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలన్నారు. గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, గణేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ వెబ్‌సైట్ మొరాయింపు

● రుణాల కోసం టీచర్లకు తప్పని ఇబ్బందులు

గుంటూరు(విద్య), జూన్ 20: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 8 వేల మంది పంచాయతీరాజ్ టీచరు, 2 వేలమందికి పైగా ఉన్న పంచాయతీ రాజ్ శాఖ మంత్రాంగ సిబ్బంది, ఉద్యోగుల భవిష్యనిధి(పీఎఫ్) ఖాతాలను గుంటూరు జిల్లా పరిషత్ గుంటూరు కార్యాలయం నిర్వహిస్తుంది. ప్రతి నెల జీతాల బిల్లు నుంచి మినహాయించిన నెలసరి పీఎఫ్ చందాలను సీఎఫ్ఎంఎస్ నుంచి వచ్చిన డేటా ఆధారంగా సంబంధిత టీచర్లు, ఉద్యోగుల వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలలోకి జమ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఎప్పటి కప్పుడు అందరికీ అందుబాటులో ఉండేలా జడ్పీ వైబ్‌సైట్‌లో వివరాలు ఉంచుతారు. గత 6 నెలలుగా జడ్పీ వైబ్‌సైట్ నిర్వహణ ఆపి వేయటం వలన ఈ స్లిప్పులు ప్రదర్శించడం లేదు. స్లిప్ కావాలంటే జిల్లాపరిషత్‌లోని పీఎఫ్ సెక్షన్‌లో ఆఫ్‌లైన్‌లో తీసుకోవాల్సిందే. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులందరూ పీఎఫ్ ముగింపు (క్లోజర్) దరఖాస్తులకు కుడా ఈ స్లిప్స్ కావాలి. ఇవి పూర్తి డేటాతో అందుబాటులో లేక వీరు చాలా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి వీలైనంత త్వరలో అప్‌డేట్ డేటాతో పీఎఫ్ స్లిప్స్ ను జడ్పీ వైబ్‌సైట్‌లో ఉంచవలసినదిగా టీచర్లు కోరుతున్నారు.



మాట్లాడుతున్న హృదయరాజు

జీవోనం 117ను తక్షణం రద్దు చేయాలి

●ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

గుంటూరు(విద్య), జూన్ 20: ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారిన జీవోనం 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ (1939) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంపాలెంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హృదయరాజు మాట్లాడుతూ 1నుంచి 5తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల ప్రవీణ్ ప్రకాశ్ ఒత్తిడి మేరకు జిల్లా అధికారులు జారీ చేసి చార్జ్ మెమోలను రద్దు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు గోవిందు వెలాంగణిరాజు మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలను వర్తింపు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల్లో వెంటనే సబ్జెక్టు టీచర్స్‌ను నియమించాలని కోరారు. ఈ సమావేశం రాష్ట్ర నాయకులు జి.విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

50,599 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 51,771 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 50,599 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,079 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17500	334	9000	16000
నెంబరు. 5	9000	15000	నెంబరు. 5	15000	15000
273	9000	15500	273	14000	14000
341	8000	17000	341	8000	17000
4884	--	–	4884	17200	17200
సూపర్ 10	14500	14500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	20000	తేజ	8500	19700
బ్యాడిగి	9000	16500	బ్యాడిగి	10000	17000
దేవనూరు డీలక్స్	10000	15000	దేవనూరు డీలక్స్	14000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	12500



పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అమ్మ ఆశీస్సులతో అసెంబ్లీకి..

- తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకో నాయనా..
- బ్రహ్మారెడ్డిని ఆశీర్వదించిన తల్లి దుర్గాంబ


ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న తల్లి దుర్గాంబ

మాచర్లటౌన్, జూన్ 20: సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడులో జిల్లాలోనే అత్యధిక మెజార్టీ సాధించి ఎమ్మెల్యే పీఠాన్ని అధిరోహించిన జూలకంటి బ్రహ్మారెడ్డి ఈనెల 21వ తేదీన అమరావతిలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు సిద్ధమయ్యారు. ముందుగా తన తల్లి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి దుర్గాంబ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గాంబ తన తనయుడు బ్రహ్మారెడ్డి, శోభారాణి దంపతులను ఆశీర్వదిస్తూ మాచర్ల నియోజకవర్గ ప్రజలు మన కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకున్నారని, వారి కలలను, ఆకాంక్షలను, ఆశలను నెరవేర్చడంలో అలుపెరగని పోరాటం చేసి సాధించాలని భావోద్వేగంతో చెప్పారు. మీ నాన్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి కన్నా మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు మనోభీష్టాన్ని, నీకిచ్చిన మాటను నెలబెట్టుకుంటానని బ్రహ్మారెడ్డి తల్లికి మాటిచ్చారు. అనం తరం అసెంబ్లీకి సమావేశాలకు అమరావతికి బయలుదేరి వెళ్లారు.

జీవితాంతం మాచర్ల ప్రజలకు రుణపడి ఉంటా

రెంటచింతల, జూన్ 20: చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా కష్టాల్లోనా వెన్నంటి ఉండి అభిమానించి ఆదరించి ఓట్ల వర్షం కురిపించి తొలిసారిగా అసెంబ్లీ మెట్లెక్కేలా కృషి చేసిన మాచర్ల ఓటర్లందరికి జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం పాలువాయి జంక్షన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మా ఇంట్లోని ముగ్గురం అసెంబ్లీకి వెళ్లాం అంటే అదంతా ఓటర్ల ఘనతేనన్నారు. తాను 2021 డిసెంబర్ 24న టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారని చివరకు దేవుని దర్శనానికి కూడా వెళ్లనీయకుండా(పశర్లపాడు బ్రహ్మంగారి తిరునాళ్ల) ఆపేశారని పేర్కొన్నారు. దైవ బలం ముందు ఇవన్నీ బలాదూర్ అని ఎన్నికల ఫలితాలు నిరూపించాయన్నారు. 3300 ఎకరాల్లో ఉన్న మంచికల్లు రిజర్వాయర్ ఆధునీకరణ, విశ్వామిత్రుడు తపస్సు చేసిన సత్రశాల ఆలయం అభివృద్ధి, తుమృకోట వద్ద కృష్ణానది లిఫ్ట్ ఇరిగేషన్ తదితర పెండింగ్ పనులను సీఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట జూలకంటి అక్కిరెడ్డి, మందలపు హనిమిరెడ్డి తదితరులున్నారు.







రెవెన్యూ మంత్రికి యరపతినేని అభినందనలు

పిడుగురాళ్ల, జూన్ 20 : రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలిశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్‌ను యరపతినేని శ్రీనివాసరావు కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు కంచేటి శివ ప్రసాద్, యరపతినేని నిఖిల్ ఉన్నారు.


రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మొక్కు చెల్లించుకునేందుకు పాదయాత్రగా..

పిడుగురాళ్ల, జూన్ 20: రాష్ట్రంలో, గురజాల నియోజకవర్గంలో గెలుపొందటంతో పార్టీ శ్రేణులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి చెందిన గాలి జగన్ విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి గుడి వరకు పాద యాత్ర గురువారం మొదలుపెట్టాడు. గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందటంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్ర బాబుకావటంతో మొక్కులు చెల్లించుకునేందుకు గాలి జగన్ అమ్మవారి గుడి వరకు ప్రారంభించిన పాదయాత్రకు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. మద్దసాని మంగిరెడ్డి, యలమందారెడ్డి, సంకుల వెంకటేశ్వర్లు, రాజశేఖర్, అనబో తుల నర్సిరెడ్డి, డాక్టర్ శంకర్, కరాలపాడు జాని, పాదర్తి సైదులు, కొత్తపల్లి గోపాల్, మద్దసాని వెంకటరెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


కరాలపాడు నుంచి పాదయాత్రగా విజయ వాడ వరకు గాలి జగన్





కౌలు రైతులకు గుర్తింపు కార్డులు వెంటనే అందజేస్తాం

- తహసీల్దార్ సువర్ణ

క్రోసూరు, జూన్ 20 : పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని, వీటి కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తే వెంటనే అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని క్రోసూరు తహసీల్దార్ ఎం సువర్ణ అన్నారు. గురువారం క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాల్లో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతులు సొంత పొలం దారుని పాసు బుక్, 1బీ, ఆధార్ కార్డు నకలు, కౌలు రైతు ఆధార్‌కార్డు నక లు, మూడు పాసుపోర్టు ఫొటోలు, దరఖాస్తు ఫారం తమకు అందజేయాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారి వీ వేణు గోపాల్ మాట్లాడుతూ క్రోసూరు మండలంలో 2,363 కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. అవగాహన కార్యక్రమాలు 26వ తేదీ వరకు రోజుకు రెండు గ్రామాల చొప్పున నిర్వహించ నున్నట్టు తెలియజేశారు. పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా, బ్యాంకుల ద్వారా రుణం పొందాలన్నా, ఇన్‌పుట్ సబ్సిడీ పొందాలన్నా గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కే శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.















సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BeB8vjvలో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** nalsar.ac.in



ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం 'విశ్వంభర' చిత్రం సెట్స్‌లో చిరంజీవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుర్గేశ్‌ను చిరంజీవి శాలువా కప్పి సత్కరించారు. మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడంలో దుర్గేశ్ విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు.



యాభై ఏళ్లుగా తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవ చేస్తూ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, హిందూపురం నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణను తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి అభినందించారు.

మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ



ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ వంటి టాప్ స్టార్స్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' ప్రమోషనల్ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికలిగిస్తోంది. అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్న 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ వన్' కుతూహలాన్ని మరింత పెంచింది. తాజాగా గురువారం రెండో ఎపిసోడ్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ ఇది. ఒక్కో వరల్డ్ నుంచి ఒక్కో థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా బిల్డప్ చేశాం. ఇందులో కాశీ మొదటిది. ఈ ప్రపంచంలో కాశీనే చివరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కల్కి' స్క్రిప్ట్ మొదలు పెట్టాం. కలియుగం చివరిలో గంగానది ఎండిపోయిన తర్వాత కాశీ ఎలా ఉంటుంది, నాగరికత ఏ విధంగా ఉంటుంది అనే ఊహతో ఆ సిటీని క్రియేట్ చేశాం. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్, కరెన్సీ.. ఇలా అన్ని విషయాల్లో ఫ్యూచరిస్టిక్‌గా ఆ సిటీని రూపొందించాం. కాశీ పైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ ఉంటుంది. దాన్ని మేం కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్ ఫుడ్.. అక్కడ ఉంటాయి. ఇదో రకం స్వర్గం అనుకోవచ్చు. మూడో ప్రపంచం శంబల. కాశీకీ, కాంప్లెక్స్‌కూ సంబంధం లేని ప్రపంచం అది. అక్కడ ఉన్న వారు కాంప్లెక్స్‌లో ఉన్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. కల్కి అవతారం శంబలలో పుడుతుందనే నమ్మకం మన శాస్త్రాల్లో ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి కలగలుస్తూ 'కల్కి' కథ నడుస్తుంది' అన్నారు.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో...



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'ద కానిస్టేబుల్'. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వం వహిస్తుండగా, జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "త్వరలోనే కానిస్టేబుల్ పాత్రతో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మీ ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. "అద్భుతమైన కథ, ఆకట్టుకునే కథనం కుదిరిన సినిమా ఇది" అని నిర్మాత జగదీశ్ అన్నారు. "ఈ సినిమాలో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూస్తారు" అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కే అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వరప్రసాద్, కెమెరామెన్: హజరత్ షేక్, సంగీతం: సుభాశ్‌ఆనంద్.



తెలుగు నిర్మాతల హిందీ చిత్రం

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాయి. ఈ రెండు సంస్థలు కలసి సన్నీడియోల్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టి.జి విశ్వప్రసాద్ నిర్మాతలు. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. డైరెక్టర్‌గా హిందీలో ఆయనకు ఇది తొలి చిత్రం. భారీ బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మేకర్స్ గురువారం లాంచ్ చేశారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎస్ థమన్, సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ.

సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలో ప్రతినాయకుడిగా అందరినీ మెప్పించిన దేవ్‌గిల్.. ఆ తర్వాత వరుస సినిమాల్లో అవకాశాలు కొట్టేసి, అనేక సార్లు ప్రతినాయకుడి పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అహో విక్రమార్క'. 'మా అబ్బాయి', 'రంగుల రాట్నం' ఫేమ్ చిత్ర శుక్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పేట త్రికోటి దర్శకత్వంలో ఆర్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవ్‌గిల్ మాట్లాడుతూ "నన్ను ఇంతవరకూ మీరందరూ విలన్ పాత్రల్లోనే చూశారు. కానీ మీ అందరికీ ఈ సినిమాతో నేను సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను" అని చెప్పారు. "టెక్నికల్‌గా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది" అని దేవ్ గిల్ భార్య, నిర్మాత ఆర్తి అన్నారు. "మంచి సినిమా చేశాం. ప్రేక్షకులందరూ ఈ సినిమాను ఆదరించాలి" అని దర్శకుడు పేట త్రికోటి కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కారంపూడి, జూన్ 20: కారంపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని కారంపూడి పట్టణం, చింతపల్లి, పేటసన్నిగండ్ల, పేటసన్నిగండ్ల తండా, ఒప్పిచర్ల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. కారంపూడి 33బై11కేవీ సబ్‌స్టేషన్లో 11కేవీ సర్క్యూట్ లింబుల్ మార్పే నిమిత్తం విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు.

బాలకృష్ణతో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి భేటి


హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, జూన్ 20: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎన్నికల రోజున, ఎన్నికల అనంతరం జరిగిన సంఘటనల గురించి బాలకృష్ణ అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై తీసుకోవాల్సిన పలు అంశాలపై వారిద్దరు చర్చించారు. మాచర్ల నియోజకవర్గం ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తన వంతు సహాయ సహకరాలు అందిస్తానని బాలకృష్ణ ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి తెలిపారు.

మంచికల్లు మహిళకు యరపతినేని సాయం


చెన్నుపాటి నారాయణమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 20: గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సొంత గ్రామమైన మంచికల్లుకు ఎప్పుడు ఏదో ఒక సాయం చేద్దామనే ఆలోచనలో ఉంటాడు. యరపతినేని స్వగ్రామమైన మంచికల్లుకు చెందిన నారాయణమ్మ కొన్ని నెలలుగా పక్షవాతంతో బాధపడుతుంది. చిన్నతనంలో యరపతినేని కుటుంబమంటే ఎంతో మక్కువతో ఉండే నారాయణమ్మ ఎలాగైన యరపతినేని చూడాలని, కొద్ది సేపు మాట్లాడాలనే ఉత్సాహంతో పిడుగురాళ్లకు వచ్చిన యరపతినేని శ్రీనివాసరావు కలిసేందుకు తన అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా బుధవారం రాత్రి యరపతినేని కలిసేందుకు వచ్చింది. నారాయణమ్మను చూసి చూడగానే యరపతినేని నారాయణమ్మ ఎలా ఉన్నావు? ఆరోగ్యం బాగుందా..? అంటూ అప్యాయంగా పలకరించటంతో పాటు వైద్యానికి అయ్యే ఖర్చును తాను అందిస్తానని భరోసా కల్పిస్తూ ఆమె మందుల ఖర్చులకు యరపతినేని కొంత సాయాన్ని అందించాడు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి.. సంక్షేమం

పెదకూరపాడు, జూన్ 20 : టీడీపీతోనే బీసీల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను గంగాధర్ మర్యాద పూర్వకంగా కలసి బొకే అందించారు.


మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్

బాధిత బాలికలను బాలికా సదన్‌కు తరలింపు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ సభ్యురాలు బత్తుల పద్మావతి

నకరికల్లు, జూన్ 20: వృద్ధుడి లైంగిక దాడికి గురైన ఇద్దరు బాలికలను మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు పిడుగురాళ్ళలోని బాలికా సదన్‌లో చేర్పించినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు ఇద్దరికి అన్ని విధాలా సహకారాలు అందిస్తామన్నారు. ఇద్దరు బాలికలను పాఠశాలలో చేర్పించి వారు చదువుకొనే విధంగా అన్ని రకాలైన ఏర్పాట్లు చేస్తామని పద్మావతి తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి


ఎంవీ రమణ (ఫైల్)

అమరావతి, జూన్ 20: మండలపరిధిలోని ధరణికోట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎంవీ రమణ(54) బుధవారం రాత్రి 1.30గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. అత్తలూరు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మాష్టారు మృతికి ఎంఈవో శివబాబు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

రైలు కింద పడి యువకుడి మృతి

దాచేపల్లి, జూన్ 20: నడికుడి రైల్వే జంక్షన్, పొందుగుల రైల్వే స్టేషన్ మధ్య 30 సంవత్సరాలు వయస్సు కలిగిన యువకుడు మృతి చెంది ఉండ టాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. గురువారం పొందుగల రైల్వేస్టేషన్ దగ్గర జరిగిన సంఘటనలో గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉంటాడని గుర్తించి ఆధారాల సేకరణ కోసమై ప్రయత్నించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదు. కుడిచేతిపైన ఆంజనేయస్వామి పచ్చ బొట్టు ఉంది. ఎవరైనా సమాచారం కావాల్సి ఉంటే 8074174484 సంప్రదించాల్సిందిగా కోరారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్నారు

దాచేపల్లి, జూన్ 20: ఆంధ్రా నుంచి తెలంగాణకు గోవులను అక్రమంగా తరలిస్తుండగా గురువారం ఆర్ఎస్ఎస్ సభ్యులు అడ్డుకున్నారు. దాచేపల్లి నుంచి తెలంగాణకు మినీ లారీలో గోవులను తరలిస్తుండగా సంఘ సభ్యులు వాహనాన్ని నిలిపివేసి దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఫిర్యాదు తీసుకొని వివరాలు సేకరిస్తున్నారు.

టమోటా మొక్కల ధ్వంసంపై ఫిర్యాదు


ఫిర్యాదు నమోదు చేసుకుంటున్న ఎస్ఐ ఆంజనేయులు

రెంటచింతల, జూన్ 20: టమోటా మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని రెంటాలలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన పెద్దకోట్ల నరేంద్ర నెల రోజుల క్రితం 20 వేల టమోటా మొక్కలను మొక్క రూపాయి చొప్పున రెంటచింతలలోని నర్సరీ నుంచి కొనుగోలు చేశారు. కూలీల ఖర్చుతో కలిపి సుమారు రూ.50 వేలు దాకా పెట్టుబడి పెట్టారు. గురువారం పొలానికి వచ్చి చూసేసరికి మొక్కలు ధ్వంసమై ఉన్నాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఆంజనేయులు పొలానికి చేరుకొని పరిశీలించారు. నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సరఫరా సమస్యతో ఏసీలు, టీవీలు దగ్ధం

సత్తెనపల్లి రూరల్, జూన్ 20: విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలతో ఏసీలు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమైన ఘటన మండలంలోని లక్కరాజుగార్లపాడులో గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 7గంటల సమయంలో విద్యుత్ ఓల్టేజీ తగ్గుతూ, పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో ఇళ్ళల్లోని ఏసీలు, ఫ్రిజ్‌లతో పాటు టీవీ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి అవి దగ్ధమైన సమయంలో గృహంలో ఉన్న కొందరు ఆ పొగతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు వెంటనే సమాచారాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు.

సత్తెనపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

'కన్నా' తో భేటీ అయిన జడ్పీ చైర్‌పర్సన్


గుంటూరులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు సిటీ, జూన్ 20 : జిల్లా పరిషత్ ద్వారా సత్తెనపల్లి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అన్నారు. గురువారం గుంటూరులో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో హెనీ క్రిస్టినా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ భేటీ అయ్యారు. సత్తెనపల్లిలో భారీ మెజారిటీతో విజయ బావుటా ఎగురవేసిన కన్నాను చైర్‌పర్సన్ దంపతులు అభినందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిషత్ కు సంబంధించిన విషయాలపై వారు కన్నా లక్ష్మీనారాయణతో కొద్ది సేపు చర్చించారు. గత ప్రభుత్వం జిల్లా పరిషత్‌ను నిధులు, విధులు లేకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని, చివరకు న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను కూడా దారి మళ్లించిందని క్రిస్టినా కన్నా దృష్టికి తీసుకువచ్చారు. దానివల్ల జిల్లాలోని 17 నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోయామని తెలిపారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా పరిషత్‌కు అన్నివిధాలా సహాయ, సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సీఎం సహకారంతో సత్తెనపల్లితో పాటు, మిగిలిన 16 నియోజకవర్గాల్లో జడ్పీ ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

కన్నాకు సచివాలయ ఉద్యోగుల అభినందనలు


టీడీపీ ప్రజావేదికలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 20: పట్టణంలోని సచివాలయ అసోసియేషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు గురువారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కన్నాను కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు కందిపోగు శ్రీనివాసరావు, ఎస్కే సైదా, కరీముల్లా, చిలుకా ప్రదీప్, జోజప్ప, గౌరీశంకర్, హనుమంతరావు, వెంకటేష్, వెస్లీ, పూజిత, జహీర, రాజేశ్వరరావు, జుబేర్ బాషా తదితరులున్నారు.

మండలంలోని పర్యటించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 20: సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం మండలంలోని గర్నెపూడి, కొమెరపూడి గ్రామాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లోని ఎన్‌టీఆర్, కోడెల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నా వెంట మండల, ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు ఉన్నారు. ఆయా గ్రామాల్లో కన్నాకు పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు. టీడీపీ ప్రజావేదికలో జరిగిన పలు కార్యక్రమాల్లో కన్నా పాల్గొన్నారు. రాజుపాలెం మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు కన్నాను మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు.

పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న కన్నా

ముప్పాళ్ళ, జూన్ 20: మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి తిరునాళ్ల మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నాకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పలు శాఖల మంత్రులను కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


మంత్రి నాదెండ్ల మనోహర్‌తో ఎమ్మెల్యే ప్రవీణ్, అతని సోదరుడు నవీన్


మంత్రి అనగాని సత్యప్రసాదును కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్


మంత్రి పయ్యావుల కేశవ్‌ను మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 20 : రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాదును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో గురువారం కలసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ప్రవీణ్ వెంట సోదరుడు నవీన్ కూడా ఉన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఆర్థికశాఖ మంత్రి పయ్యావ్‌ల కేశ్‌లను కూడా ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలను తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి కూడా ప్రవీణ్ వెంట ఉన్నారు.

కౌలు రైతులందరు కౌలు కార్డు తీసుకోవాలి : ఏవో


కొత్తపాలెంలో కౌలు రైతు కార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రావమ్మ తదితరులు

మాచవరం, జూన్ 20: మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కౌలు పొలం సాగు చేస్తున్న ప్రతి ఒక్క రైతు కౌలు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రావమ్మ కౌలు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో జరిగిన కౌలు రైతు అవగాహన కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ యామని రామారావు అధ్యక్షత వహించగా ఏవో రావమ్మ ముఖ్యఅతిథిగా హాజరై కౌలు రౌతులకు సూచనలు, సలహాలు అందించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కౌలు కార్డులు అందుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్డుల వల్ల పండించిన పంటలకు మద్దతు ధరకు అమ్ముకునే వెసులుబాటు వస్తుందని, బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందే సదుపాయం కల్పించట బడుతుందని, పంటల బీమా వర్తిస్తుందని, సబ్సిడీపై ప్రభుత్వ కల్పించే సబ్సిడీ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ కార్డు కోసం రైతు పొలం పాస్‌పుస్తకం జిరాక్స్ పొలం ఓనర్ ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలు రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలు రైతు ఫొటోలు తీసుకొని ఆయా గ్రామాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యామిని రామారావు, వీఏఏలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

దాచేపల్లి, జూన్ 20: కౌలు రైతులు గుర్తింపు కార్డు కోసం సమీపంలోని ఆర్‌బీకేలలో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకి చెందిన సొంత పొలం లేనివారు కౌలు పొలం సాగు చేస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చే నగదు, పంట నష్టపరిహారం, వాతావారణ ఆధారిత పంట బీమా, పంట రుణాలు, మద్దతు ధరకే పంట అమ్మకాలు పని చేస్తాయని వివరించారు.

రూ.5 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన


అచ్చంపేటలో బస్ షెల్టర్‌కు శంకు స్థాపన చేస్తున్న స్నేహ హస్తాల ఫౌండర్ ఎంవీ రావు సతీమణి మణ్యం రాజ్యలక్ష్మి

అచ్చంపేట, జూన్ 20: అచ్చంపేటలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో బస్‌షెల్టర్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. స్నేహ హస్తాల ఛైర్మన్ ఎంవీ రావు సతీమణి మన్యం రాజ్యలక్ష్మి(ఎన్ఆర్ఐ) రూ.5 లక్షలతో నిర్మించే బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేసింది. ఈ సందర్భంగా అచ్చంపేటకు చెందిన సంఘ సేవకురాలు మామిళ్ళపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు, హైస్కూల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అచ్చంపేటకు వచ్చే పాదచారులకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. 30 అడుగుల పొడవు, 15 అడుగుల వెడెల్పుతో నిర్మించే బస్ షెల్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఈవో రావిపాటి నరసింహారావు, తుమ్మా శౌరిరెడ్డి, మన్నెం భద్రయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, బత్తుల శ్రీనివాసరావు, యడ్లపల్లి బుచ్చిబాబు, స్నేహ హస్తాల కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నరసరావుపేట రూరల్, జూన్ 20: జిల్లాలో కూరగాయల ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయలు ధరలు పెరుగుచున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సరఫరాల అధికారి, జిల్లా ఉద్యానవన అధికారి, మరియు రైతు బజారు ఎస్టేటు అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కూరగాయల ధరల నియంత్రణ కోసం తగు సూచనలు జారీచేసినారు. ఇందులో భాగంగా ప్రైవేట్ మార్కెట్ నందు టమాట ధరలు అత్యధికంగా ఉన్నందు వల్ల పుంగనూరు, మదనపల్లె నుంచి టమాట కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, వ్యాపారుల వద్ద నిత్యావసర కూరగాయలైన టమాట, ఉల్లిపాయలు మొదలైన నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ధరల స్థిరీకరణ జరిగే వరకు టొమేటో కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

29న జరిగే లోక్ అదాలత్‌పై న్యాయాధికారి సమీక్ష


న్యాయవాదులతో సమీక్ష చేస్తున్న న్యాయాధికారి సత్యశ్రీ

నరసరావుపేట లీగల్, జూన్ 20: ఈ నెల 29న జరగనున్న నేషనల్ లోక్ అదాలత్‌కు సంబంధించి స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్ సత్యశ్రీ స్థానిక న్యాయవాదులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసులను పెద్ద సంఖ్యలో పరిష్కరించటానికి సహకరించాలని న్యాయవాదులను కోరారు. కేసుల పరిష్కారంలో ఎదురయ్యే అంశాలకు సంబంధించి న్యాయవాదులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సమీక్షలో న్యాయవాద సంఘ ఉపాధ్యక్షురాలు అమూల్య, ఏడుకొండలు, న్యాయవాదులు అయ్యపరాజు, ఆరోగ్యం చౌదరి, సలీం, కే విజయ కుమార్, బీ పిచ్చేశ్వరరావు, జీ రవీంద్ర, ఎం శ్రీనివాసరావు, శ్రీరాములు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కాపు జేఏసీ యూత్ పట్టణ అధ్యక్షుడిగా లక్ష్మణ్


లక్ష్మణ్‌కు నియామక పత్రం అందిస్తున్న బ్రహ్మనాయుడు

మాచర్ల రూరల్, జూన్ 20: కాపు జేఏసీ యూత్ మాచర్ల పట్టణ అధ్యక్షునిగా గొబ్బూరి లక్ష్మణ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్ నాయుడు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మనాయుడు గురువారం ఈ ఉత్తర్వులను లక్ష్మణ్‌కు అందజేశారు. కాపుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జక్కా నరసింహారావు, నక్షత్రపు చెన్నకేశవరావు, కేశవ, రాంబాబు, రమేష్, నరేష్, పగడాల సుబ్బారావు, సుధాకర్, బత్తుల కొండ, అమరలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు

క్రోసూరు, జూన్ 20 : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేటప్పుడు యజమాని సంతకంతో సంబంధం లేకుండా మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు కోరారు. గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించాలంటే భూయజమాని సంతకం చేయాలనే నిబంధన వల్ల 20 నుంచి 30 శాతం మంది మాత్రమే గుర్తింపు కార్డులు పొందగలుగుతున్నారని ఆయన అన్నారు. తహసీల్దార్‌కు గురువారం పలువురు రైతులతో కలసి వినతి పత్రం సమర్పించారు. కౌలు రైతులు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వాలు ఈ క్రాప్ బుకింగ్ ద్వారా అందించే విత్తనాలు గాని, నష్ట పరిహారం గాని, ఇన్సూరెన్స్ గాని పొందలే పోతున్నారన్నారు. కౌలు రైతులందరికీ రైతు భరోసా వర్తింప చేయాలన్నారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే విధంగా చట్ట సవరణ చేయాలన్నారు.

నేడు వాగ్దేవి కళాశాలలో యోగా కార్యక్రమం

గురజాలటౌన్, జూన్ 20: దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు పట్టణంలోని వాగ్దేవి కళాశాలలో శుక్రవారం యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

27న బల్లకట్టు వేలంపాట

మాచవరం, జూన్ 20: మండలంలోని గోవిందాపురం కృష్ణానదిపై నిర్వహిస్తున్న బల్లకట్టు వేలంపాటను ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్ గురువారం తెలిపారు. ఈ పాటలు గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించటం జరుగుతుందని ఆశావాహులు ఎవరైనా ఉంటే పాటలలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

జనసేన నేతల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న జనసేన నేతలు

కారంపూడి, జూన్ 20: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, సాంకేతిక శాఖల మంత్రిగా పవన్‌కల్యాణ్ పదవీ బాధ్యతలు స్వీకరించడంతో గురువారం కారంపూడిలో జనసేన నేతలు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

దుర్గి, జూన్ 20: మండల పరిధిలోని తేరాల గ్రామంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు టీడీపీ నేతలు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగుల శ్రీనివాసరావు, ఎలిషాబాబు తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి

రెంటచింతల, జూన్ 20: బడి బయట పిల్లలను బడిలో చేర్పించడంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి టీచర్లు బాగా కృషి చేయాలని ఎంపీడీవో శంకర్‌రావు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాల యంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 12 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని బడి బయట ఒక్క పిల్లాడు కూడా ఉండడానికి వీల్లేదన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

మాచర్ల రూరల్, జూన్ 20: పట్టణంలో టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గంగుల శ్రీనివాసరావు ఆధ్వర్యాన గురువారం టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో షేక్ గాలీబు, పేరువాల అనిల్‌కుమార్, దేవళ్ల రాంబాబు, షేక్ నాగుల్ జానీ, తాళ్లూరి మణికంఠాచారి, లూర్థు, దారివేముల వెంకట్రావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

క్రోసూరు, జూన్ 20 : పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈవోఆర్‌డీ పీ శివరామయ్య అన్నారు. గురువా రం జిల్లా పరిషత్ కార్యాయలంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై శ్రద్ధ చూపాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా అందిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని, సమాచార హక్కు చట్టం పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. శుక్రవారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఫాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

మాచర్ల రూరల్, జూన్ 20: పట్టణంలోని క్రీస్తు కృపా పరిచర్య ప్రార్థనా మందిరంలో గురువారం ఫాస్టర్ ఫెలోషిప్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పేరువాల ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ చిన బాలరాజు, కార్యదర్శిగా డేగల ఐజాక్‌పాల్, సహాయ కార్యదర్శిగా ముళ్ల పేతురు, కోశాధికారిగా కేఎస్ఆర్ అంబేద్కర్, సభ్యులుగా బుడిగే మేరిబాబు, ఆర్ శ్రీనునాయక్, ఎం సాల్మన్, గౌరవాధ్యక్షులుగా చంద్రపాల్, బంకా యాకోబు తదితరులు ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలపై డిపాజిట్ దారులు జాగ్రత్త వహించాలి

చిలకలూరిపేట, జూన్ 20 : సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిపాజిట్ ఖాతాల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని స్థానిక మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన డిపాజిట్ దారుల అవగాహన సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కేఎస్ రామ్ ప్రసాదు, ప్రాజెక్టు మేనేజర్ వీ అశోక్ కుమార్ కోరారు.ఈ సందర్భంగా పలు అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. డిపాజిట్ దారులు డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాం కింగ్ సేవలను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు గీటురాయి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ప్రత్తిపాటిని కలసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 20: ప్రజల సంతృప్తే అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం పనితీరుకు గీటురాయి అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో ప్రత్తిపాటి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయటంలో, పౌర సమస్యల పరిష్కారంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందు అధికారులంతా ప్రజాపాలన స్ఫూర్తిని అర్థం చేసుకోవాలన్నారు. పాలనలో చిలకలూరిపేటను అగ్రస్థానంలో ఆదర్శంగా నిలపటమే అందరి లక్ష్యం కావాలని, ఆ దిశగా సమిష్టిగా కృషి చేయాలని, ఈ క్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవటం, సమస్యల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. అనంతరం వారు ప్రత్తిపాటిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయ అధికారులు, మూడు మండలాల వీఆర్ఏలు, డ్వాక్రా యానిమేటర్లు ప్రత్తిపాటిని కలసిన వారిలో ఉన్నారు.

సైబర్ నేరాలపై డిపాజిట్‌దారులు జాగ్రత్త వహించాలి

● లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ ప్రసాదు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ ప్రసాదు

చిలకలూరిపేట, జూన్ 20: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిపాజిట్ ఖాతాల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని స్థానిక మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన డిపాజిట్‌దారుల అవగాహన సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కేఎస్ రామ్‌ప్రసాదు, ప్రాజెక్టు మేనేజర్ వీ అశోక్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. డిపాజిట్‌దారులు డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాంకింగ్ సేవలను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వీ అంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ అనీల్‌కుమార్, జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ పీ వెంకటస్వామి ముఖ్యఅతిథులుగా పాల్గొనగా రిసోర్స్ పర్సన్‌లుగా బీ నరసింహనాయక్, ట్రైనర్లుగా రవి రాజు, పృధ్వీరాజ్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

నందిని ప్రియా యాదవ్‌కు డాక్టరేట్


నందిని ప్రియా యాదవ్

నరసరావుపేట టౌన్, జూన్ 20: నరసరావుపేట పట్టణంకు చెందిన నందిని ప్రియా యాదవ్‌కు ఆచార్యా ఎన్జీరంగా ఆగ్రికల్చర్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ఆమె తల్లిదండ్రులు కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయుడు బీఆర్‌వీకే స్వామి, పద్మకుమారి గురువారం తెలిపారు. వ్యవసాయరంగంలో సజ్జ పంట ఎండను తట్టుకొని వర్షాధారిత ప్రాంతంలో ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనం కోసం చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. డాక్టర్ పీ సంజనారెడ్డి ఆమెకు గైడ్‌గా వ్యవహరించారు.

డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి కళాశాల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 20: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీకామ్ కంప్యూటర్స్ ఐదో సెమ్ ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. వై అనూష 630/700, ఎస్ బాలఅజయ్‌కుమార్ 627/700, ఎల్ రాకేష్‌నాయక్ 611/700 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, అకడమిక్ డైరెక్టర్ డీ యోగేశ్వరరావు, ఎంఆర్‌కే సతీష్‌బాబు, ఎస్‌డీ సర్దార్, జానీ హుస్సేన్, ఎస్‌కే మస్తాన్ షరీఫ్, ఎస్‌కే కస్వీమున్నీసా, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ఎన్ రాజేష్, అల్లాభక్షు, జి హనిలత, జి రేవతి, ఆర్ నాగమణి

ఏఎన్‌యూ పరీక్షా ఫలితాల్లో పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూన్ 20: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఆరవ సెమిష్టర్ పరీక్షా ఫలితాలలో పీఎన్‌సీ అండ్ ఏఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. బీసీఏలో నామేపల్లి రాజేష్ 91.70శాతం, బండారం శ్రీలాస్య 87.88శాతం, బీకామ్ జనరల్‌లో పీ అల్లాభక్షు 80.5 శాతం, మార్త గీతిక 76.17శాతం, బీకామ్ కంప్యూటర్స్‌లో రేపూడి నాగమణి 83.29 శాతం, ఏ షాజన్ 80శాతం, మార్కులు సాధించారన్నారు. బీఏ కంప్యూటర్స్‌లో గుర్రపుసాల రేవతి 80.42 శాతం, నంద వెంకటేష్ 72.71 శాతం, బీఏ లిట్రేచర్‌లో గుడిసె హనిలత 75శాతం, ఉసురుపాటి ఇనోష్ 72శాతం, మార్కుల సాధించారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం ప్రేమ్‌చంద్, ట్రెజరర్ డాక్టర్ ఎం అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి రాధా కృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

మొక్కులు చెల్లించేందుకు శ్రీశైలంకు జనసేన నాయకులు

వినుకొండ టౌన్, జూన్ 20: వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి కొంజేటి నాగశ్రీను రాయల్ అనుయాయులతో కలిసి శ్రీశైలంలో మొక్కులు చెల్లించేందుకు గురువారం బయలుదేరి వెళ్ళారు. జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొణిదల పవన్ కల్యాణ్ పిఠాపురంలో అత్యధిక మెజార్టీతో గెలిచి, రాష్ట్ర ఉపముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంతో పాటు, వినుకొండ ఎమ్మెల్యే జీ.వి ఆంజనేయులును అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మొక్కులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నాగులవరంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి 13వ వార్షిక మహోత్సవం కార్యక్రమంలో నాగశ్రీను రాయల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం నిర్వాహకులు ఆయన్ను దుశ్శాలువాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అధికార ప్రతినిధి పారెళ్ళ అభిమన్యు, గండికోట మణికంఠ, అడపాల కుమార్, కామిశెట్టి కిషోర్, పసుపులేటి రజబాబు, మంచాల వెంకి, పోలరాజు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కొంజేటి లక్ష్మణరావు, రాజావరపు అనిల్, గోపి. నాగరాజు, దుర్గం అనిల్, ఎనుముల కోటి, తిరుమలశెట్టి అనిల్‌తో పాటు కార్యకర్తలు, పవన్ అభిమానులు కలిసి తరలివెళ్ళారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి: ఎంఈవో

ఈపూరు, జూన్ 20: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్చాలని మండల విద్యాశాఖాధికారి జప్రుల్లా అన్నారు. మండల వనరుల కేంద్రంలో గురువారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నేను బడికి పోతా కార్యక్రమం గురించి వివరించారు. 6-16 సంవత్సరాల వయస్సుగల పిల్లలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉండేలా తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. అందుకోసం ప్రతి ఉపాధ్యాయుడు ఆయా పాఠశాలల పరిధిలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి గ్రామ వలంటీర్ల సాయంతో ఆ పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. పాఠశాలలో చేరిన పిల్లలకు స్టూడెంట్ కిట్, ఇతర విద్యా ప్రోత్సహకాలు అందించాలన్నారు. నూతనంగా బడిలో చేరిన పిల్లల సామర్థ్యాలు గుర్తించి, వయస్సు తగిన తరగతిలో చేర్చి ఆ స్థాయిలో రాణించేందుకు బ్రిడ్జ్ కోర్సును ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా పిల్లల తల్లిదండ్రులకు చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 రామతులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

కొచ్చెర్ల (ఈపూరు) జూన్ 20: మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరుపుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారిని భక్తులు తెల్లవారుజామునుంచే దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

విచ్చలవిడిగా ఫ్లెక్సీలు వద్దు: ప్రజా మేనిఫెస్టో కమిటీ కన్వీనర్ భానుప్రసాదు

చిలకలూరిపేట, జూన్ 20: పట్టణంలోని వివిధ సెంటర్లు, రోడ్లు, డివైడర్లు, కార్నర్ పాయింట్లలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగటమే కాక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానిక ప్రజా మేనిఫెస్టో కమిటీ కన్వీనర్ మాదాసు భానుప్రసాదు గురువారం పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా పట్టణమంతా ఫ్లెక్సీలు కట్టినప్పటికీ అధికారం నిలబెట్టుకోలేకపోయారని గమనించాలని ఆయన పేర్కొన్నారు. ఈ అనుభవాలను గుర్తించి ఆయా నాయకుల అభిమానులు ఫ్లెక్సీల సంస్కృతిని విడనాడాలని కోరారు. దీనికి బదులు పేద విద్యార్థులకు, వృద్ధులకు తగిన రీతిలో సాయంచేసి ఆయా నాయకుల పేరు చిరస్థాయిగా ఉండేలా చూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో మూడు నెలల జైలు

నరసరావుపేట లీగల్, జూన్ 20: చోరీ కేసులో నేరం రుజువవ్వటంతో నిందితుడు ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన నాగూర్ బాషాకు మూడు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక గురువారం తీర్పు వెలువరించారు. 2023 సెప్టెంబరు 23న నిందితుడు పట్టణంలోని లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ వద్ద అన్న క్యాంటీన్ వద్ద ఫిర్యాది మన్నపాటి సరోజిని మెడలోని బంగారు గొలుసును లాక్కొనివెళ్ళాడు. ఈ మేరకు ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

ఘనంగా తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల

బొల్లాపల్లి, జూన్ 20: మండలంలోని సరికొండపాలెంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ళ గురువారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ నిశ్శంకర శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూరగాయల ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

• జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

నరసరావుపేట రూరల్, జూన్ 20: జిల్లాలో కూరగాయల ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయలు ధరలు పెరుగుచున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సరఫరాల అధికారి, జిల్లా ఉద్యానవన అధికారి, మరియు రైతు బజారు ఎస్టేటు అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కూరగాయల ధరల నియంత్రణ కొరకు తగు సూచనలు జారీచేసినారు. ఇందులో భాగంగా ప్రైవేట్ మార్కెట్ నందు టొమేటో ధరలు అత్యధికంగా ఉన్నందువలన పుంగనూరు, మదనపల్లె నుండి టొమేటో కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, వ్యాపారస్తుల వద్ద నిత్యావసర కూరగాయలైన టమాట, ఉల్లిపాయలు మొదలైన నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ధరల స్థిరీకరణ జరిగేవరకు టొమేటో కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

29న జరిగే లోక్ అదాలత్‌పై న్యాయాధికారి సమీక్ష

నరసరావుపేట లీగల్, జూన్ 20: ఈ నెల 29న జరగనున్న నేషనల్ లోక్ అదాలత్‌కు సంబంధించి స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్ సత్యశ్రీ స్థానిక న్యాయవాదులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసులను పెద్ద సంఖ్యలో పరిష్కరించటానికి సహకరించాలని న్యాయవాదులను కోరారు. కేసుల పరిష్కారంలో ఎదురయ్యే అంశాలకు సంబంధించి న్యాయవాదులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సమీక్షలో న్యాయవాద సంఘ ఉపాధ్యక్షురాలు అమూల్య, ఏడుకొండలు, న్యాయవాదులు అయ్యపరాజు, ఆరోగ్యం చౌదరి, సలీం, కే విజయ కుమార్, బీ పిచ్చేశ్వరరావు, జీ రవీంద్ర, ఎం శ్రీనివాసరావు, శ్రీరాములు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో సమీక్ష చేస్తున్న న్యాయాధికారి సత్యశ్రీ

వ్యవస్థలో చొరబడ్డ వైసీపీ వేర్లన్నింటినీ కత్తిరించాలి

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ జూన్ 20: రాష్ట్ర సచివాలయం స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వరకు ప్రభుత్వ వ్యవస్థల్లో తిష్టవేసిన వైసీపీ వేర్లన్నింటినీ కత్తిరించాల్సిన తరుణం ఆసన్నమైందని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ అవమరావతి సచివాలయంలో పలువురు మంత్రులను గురువారం జీవీ ఆంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్సల్టెంట్‌లు, సలహాదారులు, ప్రత్యేక ఉద్యోగుల పేరిట ఎక్కడబడితే అక్కడ చొరబడిన వారంతా ఇంతకాలం ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా పంచుకుతిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం జనం సొమ్ముతో మాజీ ముఖ్యమంత్రి చేసిన జల్సాలన్నీ పూర్తిస్థాయిలో బయటపెడితే అతడిని జనమే ఛీకొట్టడం ఖాయమన్నారు. సొంత పార్టీ, సొంత చానెల్ కోసం పనిచేయించుకుంటూ ప్రభుత్వం జీతం పొందేలా దొడ్డిదారిలో నియమించుకున్న ఒకొక్కరికీ నెలకు 2లక్షలు, 3 లక్షలు, వరకూ జీత భత్యాలు చెల్లించారని, అదంతా ఎవడబ్బ సొమ్మని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లి, రుషికొండ ప్యాలెస్‌ల పేరిట సోకుల కోసం జగన్‌చేసిన వందల కోట్ల రూపాయల ఖర్చుకు ఇవి అదనం అన్నారు. జగన్‌తోపాటు వైసీపీ ముఖ్య నేతల ప్రైవేట్ సిబ్బందికి కూడా ప్రభుత్వం ఖజానా నుంచి డబ్బులు చెల్లించిన తీరు అత్యంత దుర్మార్గమన్నారు. తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్న ఈ భాగోతాన్ని పూర్తిస్థాయిలో ప్రజల వద్ద ఉంచుతామని, తర్వాత వైసీపీ, దాని అధినేత జగన్‌రెడ్డిని ఏంచెయ్యాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.



అరవింద బాబును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా శాంతి కల్యాణం

నాదెండ్ల, జూన్ 20: మండలంలోని సాతులూరులో రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి వారి శాంతి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వార్లకు పట్టు వస్త్రాలను అలంకరించారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కల్యాణ మహోత్సవానికి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా అయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

రైతు బజారులో తక్కువ ధరలకే టమోటాల అమ్మకం

చిలకలూరిపేట, జూన్ 20: చిలకలూరిపేట రైతు బజారులో తక్కువ ధరలకే టమోటాల అమ్మకం జరుగుతుందని రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ ఖాజా గురువారం తెలిపారు. కేజీ టమోటా రూ.64కే సబ్సిడీపై ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒక్కొక్కరికి ఒక కిలో చొప్పున మాత్రమే అమ్మకం చేస్తామని పేర్కొన్నారు. మార్కెట్‌లో కిలో టమోటా రూ.80 నుంచి రూ.100 వరకు ధర పలుకుతున్నది.



సాతులూరులో రైల్వే గూడ్స్ షెడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

గూడ్స్ షెడ్డు పూర్తయితే రైతులకు ఉపయోగం

• జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నాదెండ్ల, జూన్ 20: రైల్వే గూడ్స్ షెడ్డు నిర్మాణ పనులు పూర్తయితే పల్నాడు జిల్లాకు ఎంతో ఉపయోగమని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే గూడ్స్ షెడ్డు పనుల పురోగతిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన రైల్వే కాంట్రాక్టర్‌తో నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేస్తే రైతులకు కంపెనీల నుంచి వచ్చే ఎరువులను నేరుగా సరఫరా చేసే అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. కౌలు రైతు కార్డులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ నిధులకు సంబంధించి జరుగుతున్న ఈకేవైసీపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు, కార్యాలయ ఏడీఏ రవికుమార్, వీఆర్వో అంజలిదేవి, గ్రామ సహాయకులు వేణుగోపాల్, రామారావు, రైతులు ఉన్నారు.

బడిబయటి పిల్లలను పాఠశాలలలో చేర్పించాలి

• శావల్యాపురం తహసీల్దార్ లక్ష్మీలావణ్య

శావల్యాపురం, జూన్ 20: వివిధ కారణాలతో బడి మానేసిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను వివరించి వారిని పాఠశాలలలో చేర్పించేందుకు గ్రామస్థాయి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలతో గురువారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 11సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలు, వలంటీర్లు ఈ నెల 13 నుంచి జులై 12వ తేదీ వరకు ఆయా గ్రామాలలో ఇంటింటికీ తిరిగి బడి మానేసిన పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి వారంతా పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు. మండలంలో ఇప్పటికే 164మంది బడిబయటి పిల్లలను పాఠశాలలలో చేర్పించడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులంతా ప్రాథమిక పాఠశాలలలో చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా కృషి చేయాలన్నారు. ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న సర్పంచ్, తెలుగు యువత నాయకులు

ఈపూరు, జూన్ 20: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులు గెలిచినందుకు సర్పంచ్, తెలుగు యువత నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. ఈపూరు మండలం గుండేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కాసరగడ్డ మల్లికార్జునరావు, తెలుగు యువత నాయకులు అబ్బూరి సైదారావు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, చింతా రామకోటేశ్వరరావులు అరుణాచలం గిరిప్రదక్షిణ చేసి స్వామికి ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు.

పాదయాత్రికులకు అల్పాహారం అందజేత

శావల్యాపురం, జూన్ 20: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు భారీ విజయాన్ని సాధించిన సందర్భంగా సంతమాగులూరు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన 25మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీశైలం మల్లికార్జునస్వామికి మొక్కుబడులు తీర్చుకునేందుకు బయలుదేరారు. గురువారం శావల్యాపురానికి చేరుకొన్న టీడీపీ శ్రేణులను గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుతీప్రసాద్, గోపి, ప్రసాద్, శ్రీనివాసరావు, మందారావు, నాగమల్లేశ్వరరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

యడ్లపాడు, జూన్ 20: మండలంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఆ శాఖ ఉద్యోగులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఆప్రపున్నీసాబేగం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ రెవెన్యూ ఉద్యోగి విలేజ్ రెవెన్యూ సహాయకుడు అల్లడి జోసఫ్‌ను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ జోసఫ్‌ను శాలువాతో సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఏపీవీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి కేపీ చారి మాట్లాడుతూ రెవెన్యూ బోర్డు ఏర్పాటైన జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రభుత్వం ప్రకటించిందని, రాష్ట్రవ్యాప్తంగా దీనిని జరుపుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ

వంకాయలపాడు (యడ్లపాడు), జూన్ 20: మండలంలోని వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాకానుక కిట్లను గురువారం పంపిణీ చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బుడే, సీనియర్ టీడీపీ నాయకులు నర్సిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లను అందజేశారు. విద్యాకానుక కింద పాఠశాలలో 3 నుంచి 10 తరగతులు చదివే సుమారు 100మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్, బూట్లతోపాటు బ్యాగులు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగుర్‌వలి, నాగురా, మస్తాన్‌వలి, మౌలాలి, సాంబశివరావు, వెంకటస్వామి, ఉపాధ్యాయులు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభం

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 20: మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్లు పాఠశాల హెచ్‌ఎం మహబూబ్ సుభానీ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఇప్పటివరకు 15మంది విద్యార్థులు చేరారని, చుట్టుపక్కల గ్రామాలలోని పేద విద్యార్థులంతా కళాశాలలో చేరి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఎటువంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యను అందిస్తుందన్నారు. కళాశాల్లో ప్రస్తుతం నలుగురు లెక్చరర్లు అందుబాటులో ఉన్నారని, మిగిలిన తరగతులకు కూడా ప్రభుత్వం త్వరలో లెక్చరర్లను నియమిస్తుందన్నారు.